క్లుప్తంగా

రేషన్ వాహనాల నిలిపివేత తగదు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి బాజీబాబా

వించిపేట(విజయవాడపశ్చిమ): గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా లబ్ధిదారుల ఇళ్లకే రేషన్ పంపిణీ చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని, కాని ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రేషన్ సరఫరా చేసే వాహనాలను నిలిపేస్తూ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాజీబాబా గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ప్రకటించిన సన్న బియ్యం అటక ఎక్కించారని, ఏడాదిలోనే లక్షా డెబ్బై వేల కోట్లు అప్పుచేసినా ఇంకా సూపర్ సిక్స్ పథకాల ఊసే లేదని విమర్శించారు. మరోవైపు మద్యాన్ని మాత్రం 24 గంటలు సరఫరా చేస్తూ పేద, మధ్యతరగతి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో వారే ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని ధ్వజమెత్తారు.

ఉరుములు, పిడుగుపాటు సమయాల్లో అప్రమత్తత

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఉరుములు, పిడుగుపాటు సమయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు కనీస జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చునని కొత్తపేట అగ్నిమాపక కేంద్ర అధికారి టి. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కలరా హాస్పిటల్, సర్కిల్–1 కార్యాలయ సిబ్బందికి పిడుగుపాటు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా ప్రాణాలను కాపాడుకోవాలనే అంశంపై పలు సూచనలు చేశారు. అకాల వర్షాలు, తుపాన్ల సమయంలో వచ్చే ఉరుములు, పిడుగుపాటుకు కొన్ని సూచనలు పాటించాలన్నారు. ముఖ్యంగా వర్షం వస్తున్న తరుణంలో చెట్ల కింద, ఆరు బయట పనులు చేయకూడదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఉంటే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలన్నారు.

తటాకాలను తలపిస్తున్న రోడ్లు

- రోడ్లపై మోకాలి లోతు గుంతలు
- రోడ్లపై రోజులతబడి నిలుస్తున్న వర్షపు నీరు
- వర్షాకాలం ముంచుకొస్తున్నా స్పందించని అధికారులు



చెరువును తలపిస్తున్న విద్యాధరపురం ఆర్టీసీ డిపో ప్రాంగణం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వర్షం పడిందంటే చాలు నగరవాసులు వణికిపోతున్నారు. ప్రధాన రహదారులు వర్షపు నీటితో నిండి తటాకాలను తలపిస్తున్నాయి. రోడ్లకు వేసిన తారు కొట్టుకుపోయి మోకాలి లోతు గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ గుంతల కారణంగా ఆ రోడ్లపై వాహనాలు ఉయ్యాలలూగుతున్నాయి. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక అంతర్గత రోడ్ల పరిస్థితి చెప్పనవసరం లేదు. వర్షకాలంలో తంతు ఇలా ఉంటే అధికారులు మాత్రం కనీసం స్పందించడం లేదు.

అమరావతి నగరానికి ముఖ ద్వారం అని చెప్పుకొనే విజయవాడ ప్రధాన రహదారులు కొద్దిపాటి వర్షానికి జలమయం అవుతున్నాయి. ఓ మోస్తరు వర్షం కురిస్తే రోడ్డుపైకి వెళ్లే పరిస్థితి లేదు. నగరంతోపాటు సమీపంలోని గ్రామాల్లో ప్రధాన రహదారుల పరిస్థితి ఇంచుమించు అంతే. వర్షాలకు రోడ్డుపై వర్షపు నిలిచి గోతులు ఏర్పడుతున్నాయి. వాహనాల రాకపోకలతో అవి కాస్తా మోకాలి లోతు గుంతలుగా మారుతున్నాయి. ఎండాకాలంలో కురుస్తున్న అకాల వర్షాలకే పరిస్థితి ఇలా ఉంటే, ఇక వర్షకాలం పరిస్థితి ఏమిటని నగర వాసులు కలత చెందుతున్నారు.

- హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై గొల్లపూడి మైలురాయి సెంటర్ నుంచి సారంగం వైపు వెళ్లే ప్రధాన రహదారి వర్షపు నీరు నిలిచి అధ్వానంగా మారింది. మైలురాయి సమీపంలోని డ్వామా కార్యాలయం ఎదురుగా రోడ్డు చెరువును తలపిస్తోంది. ఇక్కడ అసలు డ్రెయినేజీ లేదు. మార్జిన్లు ఎత్తు కావడం, రోడ్డు పల్లంలో ఉండడంతో వర్షం కురిసిన తర్వాత వారం రోజుల వరకు కూడా నీరు పోవడం లేదు. ఫలితంగా తారు కొట్టుకుపోయి పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి.
- అదే రోడ్డులో బీసీ భవన్ వద్ద వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోయింది. బీసీ భవన్‌లోకి వెళ్లేందుకు మార్గం లేదు. 59 కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు నిత్యం తిరిగే ఈ ప్రాంతంలో ప్రధాన రహదారికి పక్కా డ్రెయినే లేదు. కచ్చా డ్రెయిన్ మాత్రమే ఉంది.
- భవానీపురం – గొల్లపూడి మధ్య ఎట్కిన్ సన్ రోడ్డులో మార్జిన్లు ఎత్తుగా మారి డ్రెయిన్‌లోకి వర్షపు నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో రోడ్డు పైకి వర్షపు నీరు చేరింది.
- విద్యాధరపురం ఆర్టీసీ డిపో కొద్దిపాటి వర్షానికి జలమయమవుతోంది. బస్సులు వర్షపు నీటిలోనే ఉన్నాయి. విధులకు హాజరయ్యే సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. డిపోలో వర్షపు నీరు ఇంకిపోయిన రోజే లేదు.
- కుమ్మరిపాలెం సెంటర్, ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డు, చెరువు సెంటర్‌లోవర్షపు నీరు చేరి స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు.
- పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి కనకదుర్గ ఫ్లైఓవర్ వైపు వచ్చే మార్గంలో రైల్వే వంతెనక కింద భాగంలో తరచూ వర్షపు నీరు నిలిచ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ట్రాఫిక్ భారీగా స్తంభించిపోతోంది.
- బందరు రోడ్డులో బెంజ్ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ ఆపై వరకు వర్షపు నీరు నిలిచి ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.
- ఐదో నంబర్‌రోడ్డులో పాత పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్డు, కరెన్సీ నగర్, ఆటోనగర్ ప్రాంతాల్లో వర్షకాలం రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారవుతోంది.
- ఏలూరు రోడ్డులో కొత్త వంతెన సెంటర్ నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, విశాలాంధ్ర రోడ్డులో భారీగా వర్షపు నీరు చేరుతోంది.
- కండ్రిక జంక్షన్, కండ్రిక కాలనీలో కొద్దిపాటి వర్షాలకు రోడ్లపై నీరు చేరి ప్రజలు అవస్థలు పడుతున్నారు.
- ప్రతి వర్షాకాలంలో ఈ పరిస్థితి ఉంటున్నప్పటికీ అధికారులు వర్షపు నీరు నిల్వకుండా చేపట్టాల్సిన చర్యలు చేపట్టడం లేదు. ముందస్తు ప్రణాళికలు రచించి వర్షపు నీరు వెళ్లేలా అవసరమైన పనులు చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వర్షకాలం ముంచుకొస్తున్న తరుణంలో అధికారులు స్పందించి ఎక్కడెక్కడ వర్షపు నీరు నిలుస్తుందో కారణాలు అన్వేషించి పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



బీసీ భవన్ ఎదురుగా రోడ్డుపై వర్షపు నీరు :



మైలు రాయి సెంటర్‌లో డ్వామా కార్యాలయానికి ఎదురుగా అధ్వానంగా రోడ్డు :



ఏసీబీ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు

ద్వీపంలో వృక్షాలను కొట్టేసిన వ్యక్తి పట్టివేత



బిక్షాలను విచారిస్తున్న ఈడీ ఉమామహేశ్వరరావు, డీవీఎమ్ కృష్ణచైతన్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీ ద్వీపంలోకి అక్రమంగా ట్రాక్టర్‌తో సహా చొరబడి వృక్షాలను కొట్టేసి తీసుకువెళుతున్న వ్యక్తిని భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) సిబ్బంది పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లా వెంకటాయపాలెం గ్రామానికి చెందిన బిక్షాలు అనే వ్యక్తి అక్కడ నుంచి రెండు నాటు పడవలను ఒకటిగా చేసి వాటిపై ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి వీటీపీఎస్ కూలింగ్ కెనాల్ ఎదురుగా ఉన్న ద్వీపంలోకి తీసుకువచ్చాడు. అతనితో పాటు వృక్షాలను రంపం బ్లేడ్‌తో కోసే నలుగురు వ్యక్తులను కూడా వెంట తెచ్చుకున్నాడు. పచ్చని వృక్షాలను రంపం బ్లేడ్‌తో కట్ చేసి పెద్ద పెద్ద దుంగలను ట్రాక్టర్‌లోకి లోడు చేసుకుని తరలిస్తున్నాడు. ఈ తతంగమంతా గత వారం రోజులుగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే గురువారం ఉదయం ట్రాక్టర్‌లో దుంగలను లోడ్ చేసి తీసుకువెళుతుండగా చూసిన బీఐటీసీ ఉద్యోగి వెంటనే బీఐటీసీ మేనేజర్ రవీంద్రబాబుకు సమాచారం అందించారు. ఆయన బీఐటీసీ ఈడీ ఉమామహేశ్వరరావు, ఏపీటీడీసీ విజయవాడ డివిజనల్ మేనేజర్ పి.కృష్ణచైతన్య, భవానీ ఐలాండ్ మేనేజర్ డి.సుధీర్ దృష్టికి తీసుకువెళ్లారు. వారు హుటాహుటిన ద్వీపంలోకి వచ్చారు. దీంతో బిక్షాలుతో పాటు వచ్చిన నలుగురు వ్యక్తులు తాము వచ్చిన నాటు పడవలోనే పరారయ్యారు. పోలీసులు బిక్షాలును అదుపులోకి తీసుకున్నారు. భవానీ ఐలాండ్ మేనేజర్ సుధీర్, బీఐటీసీ మేనేజర్ రవీంద్రబాబుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో బెరంపార్క్ యూనిట్ మేనేజర్ కె.శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ కొల్లి శ్రీధర్, కాంట్రాక్టర్ మన్నం కొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు

- కిటకిటలాడిన హనుమత్ ఆలయాలు
- ఆకుపూజలు, హోమాలతో మొక్కులు చెల్లించుకున్న భక్తులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని హనుమత్ దీక్షా పీఠంలో హనుమజ్జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. హనుమత్ దీక్షలు స్వీకరించిన భక్తులు దీక్ష విరమణలకు హనుమత్ దీక్షా పీఠానికి తరలివచ్చారు. తెల్లవారుజామున స్వామి వారి పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దీక్షపరులచే ఇరుముడి సమర్పణ, అన్న ప్రసాద వితరణ జరిగాయి. స్వామి వారిని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ వెలంపల్లి శ్రీనివాసరావు నుదుటిన సింధూరాన్ని అద్దారు. అనంతరం స్వామి వారి ప్రసాదాలను వెలంపల్లి శ్రీనివాసరావుకు అందచేశారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాశరం పవన్‌కుమార్ చార్యులు, విన్నకోట శ్రీనివాసరావు శర్మలు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో 108 మంది ఉభయదాతలు, భక్తులు హనుమత్ వ్రతాలను ఆచరించారు. స్వామి వారిని వైఎస్సార్ సీపీ నాయకులు పోతిన మహేష్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. లక్ష్మీ వెడ్డింగ్ కార్డ్స్ అధినేత చింతలపూడి సత్యనారాయణ, వెంకటలక్ష్మీ దంపతులు భక్తులకు అన్న ప్రసాదాలను వితరణ చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో వై. సీతారామయ్య పర్యవేక్షించగా, ఆలయ ఫౌండర్ ప్రెసిడెంట్ నందిపాటి నాగ వెంకట శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరాగా వారిని ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

విజయదుర్గా ఆలయంలో...

భీమనవారిపేటలోని విజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించారు. స్వామివారికి తెల్లవారుజామున విశేష అభిషేకాలు, అలంకరణ, నాగవల్లి దళాలతో అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మ పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు.



వెలంపల్లి శ్రీనివాసరావు నుదిటిన సింధూరం దిద్దుతున్న దుర్గాప్రసాద్ స్వామిజీ

వైభవంగా హనుమత్ జయంతి వేడుకలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అంజనిసుతుడు వీరాంజనేయుని జయంతి వేడుకలు వన్‌టౌన్‌లో గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. వన్‌టౌన్‌లోని వైష్ణవాలయాలన్నింటిలోనూ కొలువై ఉన్న హనుమత్ ఆలయాల్లో స్వామికి పలు విశేష పూజలు నిర్వహించారు. ఆకుపూజలు, సిందూరార్చనలు, క్షీరాభిషేకాలు, పంచామృత అభిషేకాలు, స్నపనాభిషేకాలు, హోమాలు, హనుమాన్‌ఛాలీసా పారాయణాలు, స్వామి వారి నగరోత్సవాలతో వన్‌టౌన్‌లోని ఆయా ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడాయి. హనుమత్ ఆలయాలు తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ కిటకిటలాడాయి. స్వామి వారి జయంతిని పురస్కరించుకొని ఆయా ఆలయాలను అత్యంత రమణీయంగా అలంకరించారు. వన్‌టౌన్‌లోని శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో వేంచేసి ఉన్న శ్రీ సంకల్పసిద్ధి హనుమాన్‌కు గురువారం పలు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు స్వామి వారికి ప్రాతఃకాల సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అలాగే భక్తులతో నిరాకటంగా గోక్షీరాభిషేకాన్ని నిర్వహింపజేశారు. అదేవిధంగా స్వామివారికి సామూహిక నాగవలీ, దళసహస్ర నామార్చన తదితర కార్యక్రమాలు జరిగాయి. భక్త బృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహించారు. సామూహిక వ్రతాలను నిర్వహించారు. మధ్యాహ్నం రెండు వేల మందికి అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు ఇతర ప్రముఖులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ అధ్యక్షులు గోకవరపు మురళీకృష్ణ, కార్యదర్శి గుడిపాటి పాపారావులు పర్యవేక్షించారు.

బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో వేంచేసి ఉన్న ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సువర్చలా సమేత హనుమాన్ ఉత్సవమూర్తికి ప్రత్యేక తిరుమంజనం నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక సహస్ర నామార్చనను నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్‌ఛాలీసా పారాయణాన్ని భక్తులు సామూహికంగా కొనసాగించారు. అలాగే ఆలయ అర్చకస్వాములు పీ శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.

కొత్తగుళ్ళు ప్రాంగణంలో.....

కొత్తగుళ్ళు ప్రాంగణంలో వేంచేసి ఉన్న ఆంజనేయ స్వామివారికి గురువారం పలు విశేష పూజలను నిర్వహించారు. ఆలయంలో ఉన్న రజిత హనుమత్ వాహనంపై కోదండరామునికి శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. కోదండరామాలయంలో వేంచేసి ఉన్న ఆంజనేయస్వామి వారికి తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం తమలపాకులతో అర్చనను నిర్వహించారు. కార్యక్రమాలను పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు నిర్వహించారు.

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): కోదండ రామ దాసాంజనేయస్వామి ఆలయంలో స్వామి వార్లకు అభిషేకం, ఆకుపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోపీకృష్ణమాచార్యులు, నారాయణ స్వామి, దొండిబట్ల వెంకట రమణాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

పంచముఖ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో...

కేటీరోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు అనంతరం విశేష అలంకరణ చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఆలయంలో స్వామి వారి సంకీర్తన రాత్రి వరకూ కొనసాగింది. వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పంచముఖ ఆంజనేయస్వామి సన్నిధిలో వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ పూజలు

దుర్గమ్మ సన్నిధిలో

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గురువారం స్వామి వారికి ఆలయ ఈవో శీనానాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంద్రకీలాద్రి క్షేత్ర పాలకుడైన శ్రీ ఆంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తొలుత అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద స్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించగా, ఆలయ ఈవో శీనానాయక్ పాల్గొన్నారు. ఘాట్‌రోడ్డులోని ఆంజనేయ స్వామి వారి ఆలయం, పాత మెట్ల మార్గంలో ఆంజనేయస్వామి వారి ఆలయంలో నాగవల్లీ దళార్చన, రుద్ర సహిత మన్యు సూక్త హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. స్వామి వారికి నిర్వహించిన విశేష పూజలల్లో భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు.



సువర్చలాదేవి సమేతంగా వీరాంజనేయస్వామి



అమ్మవారి ఆలయంలో స్వామి వారికి పూజలు

శోభాయమానంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కృష్ణప్రార్థనా మందిరం, కొత్తగుళ్ల శ్రీరామాలయం సంయుక్త ఆధ్వర్యంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శ్రీ సంకల్పసిద్ధి హనుమాన్‌జీ శోభాయాత్ర గురువారం శోభాయమానంగా జరిగింది. జై శ్రీరామ్ అంటూ భక్తుల నినాదాలతో పాటు డీజే పాటలతో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో శోభాయాత్రను నిర్వహించారు. కొత్తగుళ్ల వద్ద వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గద్దం రవి, ఆర్యవైశ్య సంఘ నేత సత్యనారాయణ తదితర ప్రముఖులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్, భారత్ వికాస్ పరిషత్, మహేశ్వరి సమాజ్, జైన్ సమాజ్, అర్బన్ ఆర్యవైశ్య సంఘం, అవధూత దత్తపీఠం, బాబా రామ్‌దేవ్ సమాజ్‌తో పాటు పలు సంఘాలు ఈ శోభాయాత్రలో పాల్గొన్నాయి. 102 కిలోల బరువు కలిగిన రజిత హనుమత్ వాహనంపై శ్రీరామచంద్రమూర్తి ఉత్సవ మూర్తులను అధిష్టింపజేసి శోభాయాత్రను కొనసాగించారు. యాత్ర పాతబస్తీ కొత్తగుళ్ల ప్రాంగణం నుంచి ప్రారంభమై బ్రాహ్మణవీధి, రథం సెంటర్, కాళేశ్వరరావు మార్కెట్, పాతబస్తీలోని వివిధ ప్రాంతాల మీదుగా తిరిగి శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరానికి చేరుకుంది. కార్యక్రమాన్ని కన్వీనర్ వనమాహరి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో నృత్యకళాకారులు శోభాయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ గుడిపాటి పాపారావు, కొత్తగుళ్ల కమిటీ ప్రముఖులు నందిపాటి శివకుమార్, మామిడి వెంకట కృష్ణారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ చెవిటి శ్రీనివాసు, మహేశ్వరి సమాజ్ ప్రముఖులు నందకిషోర్ లోయ, వివిధ సంఘాలకు చెందిన చారుగుండు రమేష్, ఓంజీ, పన్నాలాల్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ఆలయాలకు రక్షణ కరువు

శైవ పీఠాధిపతి శివస్వామి

విజయవాడ కల్చరల్: కూటమి ప్రభుత్వంలో హిందూ ఆలయాలకు, వాటి ఆస్తులకు రక్షణలేకుండా పోయిందని శైవ పీఠాధిపతి శివస్వామి పేర్కొన్నారు. వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. విశ్వహిందూ పరిషత్ మహానగర్ ఆధ్వర్యంలో గురువారం బీఆర్‌టీఎస్ రోడ్డులో హనుమత్ జయంతి సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శివస్వామి మాట్లాడుతూ.. హనుమత్ జయంతిని విజయ్ దివస్‌గా భావించాలని శైవ పీఠాధిపతి శివస్వామి సూచించారు. హనుమంతుడిలోని కార్యదీక్షను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. మాతా శివానంద సరస్వతి మాట్లాడుతూ.. సర్వహిందువులు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గ్రామంలోనూ రామ మందిరాలను నిర్మించాలన్నారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు సుబ్బరాజు, పుట్టగుంట సతీష్, నగరశాఖ అధ్యక్షుడు సానా శ్రీనివాస్, కార్యదర్శి క్రోవి రామకృష్ణ, కోశాధికారి పేర్ల రవీంద్రగుప్తా, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరావు, బీజేపీ నాయకులు నాగలింగం శివాజీ, తూములూరి చైతన్య శర్మ పాల్గొన్నారు. నగరంలోని పాత బస్తీ, సింగ్‌నగర్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, కృష్ణలంక, పాయకాపురం తదితర ప్రాంతాల నుంచి హనుమాన్ భక్తులు ర్యాలీగా బీఆర్‌టీఎస్ రోడ్డులోని ఆది శంకర సర్కిల్‌కు చేరుకున్నారు. అనంతరం బైక్ ర్యాలీ శోభాయమానంగా సాగింది. మహిళలు పెద్ద సంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొన్నారు. జై శ్రీరాం నినాదాలతో ర్యాలీ సాగిన ప్రాంతాలు ప్రతిధ్వనించాయి.

యూటీఎఫ్ కార్యాలయంలో బదిలీల ఆన్‌లైన్ సేవలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన ఆన్‌లైన్ సేవా కేంద్రాన్ని ఆ సంఘ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ప్రారంభించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పీ మనోహర్ కుమార్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బదిలీల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఉపాధ్యాయులకు సాయం చేసేందుకు ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను సమర్పించటానికి ఈ కేంద్రం సహకరిస్తుందన్నారు. సీనియర్ లిస్టులు వచ్చిన తర్వాత వెరిఫికేషన్ చేసుకుని అభ్యంతరాలు ఏమైనా ఉంటే పరిశీలించి ఫైనల్ లిస్ట్ పబ్లిష్ చేసిన తరువాత వెబ్ ఆప్షన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బదిలీల షెడ్యూలు విడుదల చేయడం హర్షణీయమన్నారు.

ద్వీపం పూర్వ వైభవానికి ప్రణాళికలు సిద్ధం

రెండు దశల్లో రూ.3.89 కోట్లు మంజూరు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖకు చెందిన భవానీ ద్వీపాన్ని అభివృద్ధి చేసి పూర్వవైభవాన్ని తీసుకువచ్చేందుకు ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, సీఈఓ హిమాన్షు శుక్లా చొరవతో భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) నుంచి నిధులు మంజూరయ్యాయి. మొదటి దశకు రూ.2.65 కోట్లు, రెండవ దశకు రూ.1.24 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో వరదలు వచ్చినప్పుడు దాని ఉధృతికి ద్వీపం వెంబడి నదీ తీరం కొట్టుకుపోకుండా ద్వీపంలోని ఐకాన్ టవర్‌కు మరమ్మతులు చేయటంతో పాటు దాని చుట్టూ, జట్టీ ఏరియాలో కూడా సుమారు 150 మీటర్ల ఎత్తులో స్టీల్ షీట్ ఫైలింగ్ చేయనున్నారు. ఐకాన్ టవర్, జట్టీ చుట్టూ ఇసుక బస్తాలతో ఫిల్లింగ్ చేస్తారు. ఇటీవల సంభవించిన వరద తాకిడికి ధ్వంసం అయిన ద్వీపంలోని గేమింగ్ జోన్ పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు. మేజ్ గార్డెన్‌కు మరమ్మతులు చేపట్టి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ద్వీపంలో గల పాత్‌వే పక్కన ఉన్న ఎలక్ట్రికల్ స్ట్రీట్ లైటింగ్ (వరదల్లో దెబ్బతిన్నవి)ను పునరుద్ధరిస్తారు. ముఖ్యంగా ద్వీపానికి అందాన్నిచ్చే ల్యాండ్ స్కేపింగ్ మొన్న వరదల్లో పాడైపోగా దానిని సరికొత్తగా తీర్చిదిద్దనున్నారు. వరద ఉధృతికి ధ్వంసమైన పాత్‌వేను సిమెంట్ కాంక్రీట్‌తో అభివృద్ధి చేయటం, పాత్‌వే పక్కన ఉండే బెంచీలు ఏర్పాటు చేయనున్నారు. ఓపెన్ జిమ్ పరికరాలకు మరమ్మతులు చేసి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తారు. రెండు దశల్లో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులన్నీ బీఐటీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఇంజినీరింగ్) ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో జరుగనున్నాయి.



పునరుద్ధరించనున్న పాత్‌వే



మరమ్మతులు చేయనున్న భవానీ ద్వీపం ఐకాన్ టవర్